క్లుప్తంగా

జనవరి 14 నుంచి భద్ర మహంకాళీ జాతర



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: కోటపాలెంలో జనవరి 14 నుంచి 16 వరకు జరగనున్న భద్రమహంకాళీ అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తెలిపారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఆలయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు జాతరను ఆంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు జరగకుండా కార్యాచరణ రూపొందించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, కోటపాలెం సర్పంచ్ గొర్లె జగదీష్, ఎంపీటీసీ సుంకరి కిషోర్‌కుమార్, నాయకులు మైలపల్లి కామరాజు, చిల్ల వెంకటరెడ్డి, గొర్లె తిరుపతినాయుడు, కురిటి రామకోటి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవైష్ణవ సంఘం ఆత్మీయ కలయిక



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు తదితరులు

రణస్థలం: చాత్తాద శ్రీవైష్ణవ సంఘానికి ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందిస్తానని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు తెలిపారు. రణస్థలం మండల పరిషత్ ఆవరణలో సంఘం ఆత్మీయ కలయిక ఆదివారం నిర్వహించారు. సంఘం అభివృద్ధి, కమిటీల ఏర్పాటు వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా నాయకులు అలవెల్లి తిరుమలేశ్వరరావు, తాలూరి నవీన్, ఎతిరాజ్యం శోభన బాబు, ఏపీ సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసనందస్వామి, శ్రీకాకుళం, రణస్థలం, టెక్కలి చిత్తాద శ్రీ వైష్ణవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నీతికథల పోటీలు



పోటీలో పాల్గొన్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు నీతికథల పోటీలు నిర్వహించారు. 25 మంది విద్యార్థులు హాజరై కథలు చెప్పారు. విజేతలకు సంస్థ వ్యవస్థాపకులు ఎల్.నందికేశ్వరరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీఎంఎస్ పట్నాయక్, సాయిప్రసాద్, ఎల్.దీప్తి పాల్గొన్నారు.

నేడు బాతువలో రెవెన్యూ సదస్సు

జి.సిగడాం: మండలంలోని బాతువ గ్రామంలో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ తెలిపారు. గ్రామ రైతులు తమ భూ సమస్యలను సదస్సుల ద్వారా పరిష్కారం చేసుకోవాలన్నారు.

వైభవంగా దత్తజయంతి వేడుకలు



చిం దత్తక్షేత్రంలో దత్తాత్రేయునికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: ఫాజుల్‌బాగ్‌పేటలోని చిం దత్తనాథ క్షేత్రంలో అనఘా సమేత దత్తాత్రేయ స్వామికి అర్చకులు సింహాచలశర్మ ఆధ్వర్యంలో ఆదివారం అభిషేకార్చనలు నిర్వహించారు. అనంతరం దత్తహోమం, లలితా సహస్ర నామ పారాయణ, అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు కమిటీ సభ్యులు, మాతృశ్రీ మండలి ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. బలగలోని బాల త్రిపుర కాలభైరవ పీఠంలో గణేష్ గురూజీ ఆధ్వర్యంలో దత్తాత్రేయునికి అభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. మొండేటివీధిలోని షిరిడిసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో షిరిడి సాయి మందిరంలోని గురుదత్తాత్రేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.



బలగలో దత్తాత్రేయుడికి అభిషేకాలు

కార్పొరేషన్ ఆదాయానికి గండి

- ఇష్టారాజ్యంగా ఎగ్జిబిషన్ల నిర్వహణ
- నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు
- పునరుద్ధరణ కాని ఎగ్జిబిషన్ కమిటీ



పీఎస్ఎన్ఎం స్కూల్ వెనుక ప్రైవేటు స్థలంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్



శ్రీకాకుళం మహిళా కళాశాల ఆవరణలో ఎగ్జిబిషన్ కోసం ఏర్పాట్లు

శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరంలో ప్రైవేటు స్థలంలో ఎగ్జిబిషన్ నిర్వహించటం వల్ల కార్పొరేషన్‌కు రావాల్సిన లక్షలాది రూపాయల ఆదాయానికి గండిపడుతోంది. ఇంతకుముందు వైఎస్సార్ కూడలి(సెవెన్ రోడ్ జంక్షన్)లోని మున్సిపల్ గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ నిర్వహించేవారు. అందుకే ఆ ప్రాంతాన్ని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌గా పిలిచేవారు. అయితే అదే మైదానంలో హ్యాండ్‌బాల్, వాలీబాల్ వంటి కోర్టులు ఉండటంతో వాటికి ఇబ్బందని పేర్కొంటూ పీఎస్ఎన్ఎంహెచ్ స్కూల్ ఆవరణలో ఎగ్జిబిషన్లు నిర్వహిస్తూ వస్తున్నారు. కారణం ఏదైనప్పటికీ గత ఆరు నెలలుగా దీనిని కూడా మార్చేసి పీఎస్ఎన్ఎంహెచ్ స్కూల్ వెనుకన ఉన్న ప్రైవేటు స్థలంలోను, 80 అడుగుల రోడ్డులోని ఓ ప్రైవేటు స్థలంలోను ఎగ్జిబిషన్ నిర్వహణకు రెవెన్యూ అధికారులు అనుమతులు ఇస్తున్నారు. తాజాగా 80 అడుగుల రోడ్డులో కాకుండా మహిళా కళాశాల ఆవరణలో ఎగ్జిబిషన్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం చర్చనీయాంశమైంది. గతంలో ఇక్కడ ఎగ్జిబిషన్ నిర్వహణకు అనుమతి ఇచ్చినప్పటికీ అప్పుడు వేసవి సెలవులు కావటంతో ఎవరికీ ఇబ్బంది లేదు. నిబంధనల ప్రకారం వేసవి సెలవుల్లో ఎగ్జిబిషన్ నిర్వాహణకు అనుమతులు ఇచ్చేవారు. అది కూడా నగరంలో ఒక ఎగ్జిబిషన్‌కు మాత్రమే అనుమతి ఉండేది. గతంలో ఉన్న నిబంధనలు కాదని ఒకేసారి రెండు ఎగ్జిబిషన్ల నిర్వహణకు, అధికాకుండా వేసవి కాకుండా సీతాకాలంలో అనుమతి ఇవ్వటం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఎగ్జిబిషన్లు జనవరి నెలాఖరు వరకు నిర్వహిస్తారు. మళ్లీ వేసవిలో ఎగ్జిబిషన్‌కు అనుమతి ఇస్తున్నారు. ఇలా రెండు చోట్ల సంవత్సరంలో రెండు సార్లు ఎగ్జిబిషన్ నిర్వహణకు అనుమతి ఇవ్వటం, ప్రైవేటు స్థలాల్లో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయటం వల్ల కార్పొరేషన్ ఆదాయానికి గండి పడుతోంది. గతంలో ఎగ్జిబిషన్ కమిటీ ఉండేది. ఆ కమిటీ సభ్యులు కొన్నేళ్ల క్రితం కలెక్టర్‌ను కమిటీ నుంచి తప్పించేందుకు యోచించగా అప్పటి కలెక్టర్ ఆగ్రహించి కమిటీని రద్దు చేశారు. ఇప్పటి వరకు కమిటీని పునరుద్ధరించలేదు. దీంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రవేశ రుసుం కూడా ఇష్టానుసారం పెంచి వసూలు చేస్తున్నారు. దీనివల్ల వినోదంగా ఉండాల్సిన ఎగ్జిబిషన్ వ్యాపారంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పునరాలోచించి ఏడాదిలో ఒకసారి, అది కూడా వేసవిలో ప్రభుత్వ స్థలంలో నిర్వహించి ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చేయాలని పలువురు కోరుతున్నారు.

అధికారులతో చర్చిస్తా..

ఎగ్జిబిషన్ నిర్వాహణకు సంబంధించి ప్రణాళికా విభాగం, ఇంజినీరింగ్ అధికారులతో చర్చిస్తాను. కార్పొరేషన్ ఆదాయానికి గండి పండకుండా, ఎవరికీ ఇబ్బంది లేకుండా ఉండేలా చర్యలు తీసుకుంటాం.

– ప్రసాదరావు, కమిషనర్, నగరపాలక సంస్థ, శ్రీకాకుళం

జ్ఞానావతారుడు దత్తాత్రేయుడు



నిష్టల నరసింహమూర్తి ని సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: పరిపూర్ణ జ్ఞానావతారుడు దత్తాత్రేయుడని నిష్టల నర్సింహమూర్తి అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో దత్తజయంతి సందర్భంగా ఆదివారం 'దత్రాత్రేయ వైభవం' అనే అంశంపై ప్రసంగించారు. మంత్ర, తంత్ర, యోగ తత్త్వ మార్గాలలో గురుమూర్తిగా ఉన్న 'దత్త' అనే నామం సర్వదోషహరణమని పేర్కొన్నారు. దత్తుని వెనుక ఒకగోవు, నాలుగు వేదాలకు ప్రతిరూపాలుగా 4 శునకాలు ఉంటాయని వివరించారు. ఆధ్యాత్మిక సంప్రదాయంలో గురువు అంటే దత్తాత్రేయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోమల రావు, గుంటుకు విశ్వేశ్వరరావు, వి.వి.నాగేంద్ర, చాగంటి బాపయ్య, డి.జి.పట్నాయక్, కామేశ్వర రావు, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

జనవరిలో తెరవే శతమాస సాహితీ సమ్మేళనం



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు రచయితల వేదిక(తెరవే) ప్రతి నెలా నిర్వహించే సాహితీ సమ్మేళనంలో భాగంగా జనవరి 5న శతమాస సాహితీ సమేళనం నగరంలోని శాంతినికేతన్ కళాశాలలో నిర్వహించనున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు యు.నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి తెలిపారు. స్థానిక సానావీధిలో ఆదివారం తెరవే సాహితీ సభ్యుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మేళనంలో భాగంగా తెరవే సభ్యులు రచించిన కవితా సంకలనం పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కవులను, రచయితలను సత్కరిస్తామని చెప్పారు. సంస్థ సభ్యులు, రచయితలు, కవులు, బాషాభిమానులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో ఐఎన్‌డీ ప్రసాద్, ఇద్ది పాపయ్య, వి.రాజారావు, పి.వి.దుర్గాప్రసాద్, బి.జగన్నాథరావు, తోట గోపాలరావు, ఎం.ఉపేంద్ర శర్మ, కె.త్రినాథరావు, మంగిపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు



సంతోషిమాతకు హారతులు



హౌసింగ్ బోర్డుకాలనీలో లలితాదేవికి అలంకరణ



గోవిందనగర్‌కాలనీలో రాజరాజేశ్వరీ దేవికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో సంతోషమాత అమ్మవారికి ఆదివారం మార్గశిర పౌర్ణమి సందర్భంగా అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు, దశవిధ హారతులు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీలోని లలితాదేవి ఆలయంలో అర్చకులు వేదుల చంద్రశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో పౌర్ణమి పూజలు జరిగాయి. గోవిందనగర్ కాలనీలోని రాజరాజేశ్వరీ ఆలయంలో అర్చకులు ధర్మపురి గౌరీశంకరశాస్త్రి, బంకుపల్లి చరణ్‌శంకర్‌శర్మ, గీతాశర్మ ఆధ్వర్యంలో శ్రీచక్రపూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు మొదలవలస ఉషారాణి, జగన్మోహనరావు దంపతుల ఆధ్వర్యంలో 800 మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. కత్తెరవీధిలోని శ్యామా వార్తాలి సమేత శ్రీచక్ర మహామేరు సహిత రాజరాజేశ్వరి లలితా మహాత్రిపు సుందరి దేవి పీఠంలో సుసరాపు లక్ష్మీగణపతి శర్మ ఆధ్వర్యంలో శ్రీచక్ర నవావరణ పూజా కార్యక్రమం నిర్వహించారు.

నేటి నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు శిక్షణ తరగతులు

జి.సిగడాం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ సచివాలయం సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. అందరూ హాజరుకావాలని కోరారు.

కాలభైరవ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



కాలభైరవునికి పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని బాల త్రిపుర కాలభైరవపీఠం దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో కాలభైరవునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి రాహుకాల దీపాలను వెలిగించారు. కాలభైరవ దీక్షలు స్వీకరించిన పలువురికి మాలధారణలు చేశారు.

పెంట విద్యార్థుల ప్రతిభ



శివప్రసాద్



రమణమ్మ

జి.సిగడాం: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఇటీవల విడుదల చేసిన పరీక్ష ఫలితాల్లో పెంట గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సి.ఐ.ఎస్.ఎఫ్ విభాగంలో కానిస్టేబుల్‌గా మీసాల శివప్రసాద్, ఐ.టి.బి.పి. కానిస్టేబుల్‌గా మక్క రమణమ్మ ఎంపికయ్యారు. ఇద్దరూ సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన వారే. వీరిని పలువురు గ్రామస్తులు ఆదివారం అభినందించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

జి.సిగడాం: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉంటూ చదువుపైనే దృష్టి సారించాలని ఎస్ఐ వై.మధుసూదనరావు సూచించారు. ఆదివారం జి.సిగడాంలో ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా కోడి పందేలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్రిస్మస్ సందడి



డ్యాన్స్ చేస్తున్న మహిళలు



క్రిస్మస్ కేరల్స్ వేడుకలో క్రైస్తవ సోదరులు



హాజరైన క్రైస్తవులు

నగరంలో ముందస్తు క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. శ్రీకాకుళం మహిళా కళాశాల రోడ్డులోని క్రిస్టియన్ వర్షిప్ సెంటర్‌లో ఆదివారం సండే స్కూల్ క్రిస్మస్ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. పాస్టర్ జోయ్‌పల్లా క్రీస్తు సందేశం అందించారు. చిన్నారులు క్రీస్తు గీతాలను ఆలపిస్తూ నృత్యాలు చేశారు. డగ్లస్ స్కూల్ ఆవరణలోని కీస్టోన్ చర్చి వద్ద పాస్టర్ జోయల్ గోడి ఆధ్వర్యంలో క్రిస్మస్ కేరల్స్ వేడుక ఘనంగా ప్రారంభమైంది. మూడురోజుల పాటు పలు వీధులలో తిరుగుతూ క్రిస్మస్ ప్రాధాన్యతను వివరిస్తూ చిన్నారులకు చాక్లెట్లు పంచడం ఈ కార్యక్రమ ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

– శ్రీకాకుళం కల్చరల్

కాలువలు కలేనా?



నగరంలోని రైతు బజారు సమీపంలో సాలివీధిలో కాలువలు లేక మురుగునీరంతా రోడ్డుపైనే ప్రవహిస్తోంది. దీంతో ఇటువైపుగా రాకపోకలు సాగించేవారు ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈగలు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఈ విషయాన్ని కార్పోరేషన్ అధికారులకు విన్నవించుకున్నా చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

మహా మృత్యుంజయ హోమం



పీఎన్‌కాలనీలోని వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయంలో సహస్ర పూర్ణచంద్ర దర్శన శతాభిషేకాల పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రతిష్టాపనాచార్యులు చామర్తి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అర్చనలు పారాయణలు, సూర్యనమస్కారాలు, సహస్ర లింగ ప్రస్తార రచన, మహామృత్యుంజయ హోమాలు జరిగాయి. కార్యక్రమంలో నిక్కు అప్పన్న, చెరుకుపల్లి వరహ నరసింహమూర్తి, పి.జగన్మోహనరావు, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

ఆత్మీయ కలయిక



శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో 1980–83 బ్యాచ్‌కు చెందిన బీఎస్సీ బయాలజీ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం కాలేజీ సిల్వర్ జూబ్లీ ఆడిటోరియంలో జరిగింది. అందరూ ఒకే వేదికపైకి చేరి ఆనాటి స్మృతులను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, కె.కృష్ణమోహన్, డాక్టర్ కె.రవికుమార్, బి.రవికుమార్, బి.రవికిషోర్, ఎం.ఏడుకొండలు, గుమ్మా నగేష్, తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం న్యూకాలనీ

కాంట్రాక్ట్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలి

అరసవల్లి: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో 2022 డీఎస్సీ ద్వారా నియమించిన కాంట్రాక్ట్ ఎంపీహెచ్ఏ (మేల్) హెల్త్ అసిస్టెంట్‌లను తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలని పలు ఉద్యోగ సంఘ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక యూటీఎఫ్ భవనంలో ఆదివారం పలు ఉద్యోగ సంఘ నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఇటీవల ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 1200మంది హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోనుంచి తొలగించిన విషయం తెలిసిందే. 22 ఏళ్ల అనుభవంతో పనిచేస్తున్న మేల్ హెల్త్ అసిస్టెంట్‌లను ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా ఉద్యోగం నుంచి తొలగించడం అన్యాయమని, ఊహించని విధంగా వాళ్లంతా రోడ్డున పడ్డారని సంఘ ప్రతినిధులు మండిపడ్డారు. 2002లో అప్పటి సీఎం చంద్రబాబే డీఎస్సీ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ నియామకాలు చేశారని, మళ్లీ ఆయన హయాంలోనే ఈ విధంగా తొలగింపు చర్యలను చేపట్టడం దారుణమని అన్నారు. జిల్లాలో సుమారు 123 మందిని అన్యాయంగా తొలగించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలు ఉద్యోగ సంఘ నాయకులు పి.అప్పారావు, డి.సాయిప్రసాద్, బి.మురళి, టి.విజయ్‌మోహన్, ఎస్.గోవిందరావు, రాణాప్రతాప్, ఎన్వీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళులు

అమరజీవి పొట్టి శ్రీరాములును ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల వ్యాప్తంగా ఆదివారం శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. శ్రీరాములు విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం క్రైమ్: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): గాంధీపార్కులో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు



ఎచ్చెర్ల: లావేరు గ్రంథాలయంలో..



రణస్థలం: పొట్టి శ్రీరాములు, పటేల్ చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్



శ్రీకాకుళం అర్బన్: పొట్టిశ్రీరాములు కూడలిలో..



శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టరేట్‌లో అమరజీవికి నివాళులు..



శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..



శ్రీకాకుళం న్యూకాలనీ: హయాతీనగరంలో గురుకుల పాఠశాలలో..



ఎచ్చెర్ల క్యాంపస్: అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో..

నేటి నుంచి తిరుప్పావై పవచనాలు

గార: విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథాలయంలో సోమవారం నుంచి నెల రోజుల పాటు తిరుప్పావై ప్రవచనాలు జరుగుతాయని ఈవో జి.గురునాథరావు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో దేవాలయ స్థానాచార్యులు శ్రీ భావ్యం పద్మనాభాచార్యులు ప్రవచనాలు చెబుతారని, ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో భక్తులంతా పాల్గొనాలని కోరారు.